సాక్షి
యాదాద్రి భువనగిరి
శుక్రవారం । 29 । డిసెంబర్ । 2023



గంజాయి పట్టివేత
హైదరాబాద్‌కు గంజాయిని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను సూర్యాపేట పోలీసులు అరెస్ట్ చేశారు.
- 10లో



క్రీడాకారుల ఎంపిక
మల్లకంబ క్రీడ ఉమ్మడి జిల్లా క్రీడాకారుల ఎంపిక గురువారం చౌటుప్పల్‌లోని ట్రినిటీ హైస్కూల్‌లో నిర్వహించారు.
- 12లో



ముగిసిన అధ్యయనోత్సవాలు
యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో జరుగుతున్న అధ్యయనోత్సవాలు గురువారం ముగిశాయి.
- 12లో

తవ్వేకొద్దీ అక్రమాలు!

సీఎంఆర్‌లో మిల్లర్ల మాయాజాలం

భూదాన్‌పోచంపల్లి మండలంలోని ఓ రైస్ మిల్లుకు వానాకాలం కేటాయించిన సీఎంఆర్ పూర్తి చేయకపోవడంతో యాసంగి సీజన్‌కు వడ్లు ఇవ్వలేదు. మరో మిల్లు యజమాని వానాకాలం వడ్లను తక్కువ ధరకు కొనుగోలు చేసి సీఎంఆర్ లెక్కలు చూపాడు. జిల్లాలో మరో నాలుగైదు మిల్లులు ఇదే తరహాలో అక్రమాలకు పాల్పడినట్లు అధికారులు గుర్తించారు. లెక్క చూపని పక్షంలో బాధితులపై ప్రభుత్వం చర్యలకు సిద్ధమవుతోంది.

గత వానాకాలం, యాసంగి సీఎంఆర్ (మెట్రిక్ టన్నుల్లో)

మిల్లర్లకు ప్రభుత్వం ఇచ్చిన ధాన్యం	మిల్లర్లు ఇవ్వాల్సిన బియ్యం
6,96,399	4,70,699
ఇప్పటి వరకు ఇచ్చిన బియ్యం	పెండింగ్
2,56,350	2,14,349



బీబీనగర్ మండలం భట్టుగూడెంలోని కాదంబరి రైస్ మిల్లులో తనిఖీలు చేస్తున్న అధికారులు

లక్ష్యం.. ఇచ్చిన సీఎంఆర్
ఈ ఏడాది వానాకాలం జిల్లాలోని 44 రైస్ మిల్లులకు ప్రభుత్వం 6,96,399 మెట్రిక్ టన్నుల వడ్లు ఇచ్చింది. ఎఫ్‌సీఐ, సివిల్ సప్లైకి 4,70,699 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లర్లు ఇవ్వాలి. కానీ ఇప్పటి వరకు 2,56,350 మెట్రిక్ టన్నులు మాత్రమే ఇచ్చారు. ఇంకా 2,14,349 మెట్రిక్ టన్నులు పెండింగ్‌లో ఉంది.

- సకాలంలో ఇవ్వకుండా మరో సీజన్‌కు పొడిగింపు
- బియ్యాన్ని ప్రైవేట్‌కు అమ్ముకుంటున్న మిల్లర్లు
- అధికారుల తనిఖీల్లో వెలుగులోకి
- లెక్కలు సరిచేసే పనిలో మిల్లుల యజమానులు

సాక్షి, యాదాద్రి : మిల్లర్లకు కేటాయించిన ధాన్యాన్ని తిరిగి ఇవ్వాల్సి ఉండగా అవి పక్కదారి పడుతున్నాయి. ప్రైవేట్‌కు బియ్యం అమ్ముకుంటూ వ్యాపారం చేసుకుంటున్నారు. సీఎంఆర్ ఇవ్వడంలో ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నట్లు అధికారుల విచారణలో వెల్లడైంది. రైస్ మిల్లులకు సీఎంఆర్ కింద కేటాయించిన ధాన్యానికి, ఎఫ్‌సీఐకి తిరిగి అప్పగించిన బియ్యానికి లెక్కల్లో తేడాలు ఉన్నట్లు గుర్తించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని రైస్ మిల్లుల్లో సివిల్ సప్లై అధికారులు చేపట్టిన తనిఖీలు రెండో రోజు గురువారం కొనసాగాయి. మిల్లులకు ఇచ్చిన వడ్లు, మిల్లుల్లో ప్రస్తుతం ఉన్నవి, ఎఫ్‌సీఐకి సీఎంఆర్ ఎంత ఇచ్చారనే అంశాలపై విచారణ కొనసాగుతోంది.

కాదంబరి మిల్లులో తనిఖీలు
బీబీనగర్ మండలం భట్టుగూడెంలోని కాదంబరి రైస్ మిల్లులో రెవెన్యూ, సివిల్ సప్లై అధికారులు తనిఖీలు చేశారు.గడిచిన మూడు సీజన్ల నుంచి మిల్లుకు ఇచ్చిన ధాన్యం, సీఎంఆర్‌పై విచారణ చేపట్టారు. బుధవారం అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, డీఎస్‌ఓ శ్రీనివాస్‌రెడ్డి మిల్లులో తనిఖీ చేసి నివేదికను సివిల్‌సప్లై కార్పొరేషన్ కు పంపించారు. ఈ మేరకు గురువారం సివిల్‌సప్లై కమిషనరేట్ అధికారుల బృందం కాదంబరి మిల్లులో తనిఖీ చేసింది. 2022 యాసంగి, 2023 వానాకాలం, యాసంగి సీజన్లకు సంబంధించిన ధాన్యం లెక్కలు తీస్తున్నారు. వానాకాలం సీజన్‌లో ఖమ్మం జిల్లా నుంచి 20 మెట్రిక్ టన్నుల ధాన్యం ఈ మిల్లుకు అధికారులు అదనంగా కేటాయించడం అప్పట్లో విమర్శలకు దారితీసింది.

కోట్ల రూపాయల దందా
బహిరంగ మార్కెట్‌లో మన బియ్యానికి ఉన్న డిమాండ్‌ను మిల్లర్లు సొమ్ము చేసుకుంటున్నారు. కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను ప్రైవేట్‌గా అమ్ముకుంటున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ క్రమంలోనే ఎఫ్‌సీఐకి సీజన్ వారీగా ఇవ్వాల్సిన సీఎంఆర్‌ను ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నట్లు తేల్చారు. సీఎంఆర్ సకాలంలో ఇవ్వకుండా మరో సీజన్ వరకు పొడిగిస్తున్నారు. రైతుల వద్ద వడ్లు తక్కువ ధరకు కొనుగోలు చేసి బియ్యంగా మార్చి సీఎంఆర్‌గా లెక్కలు చూపుతున్నట్లు అధికారులు గుర్తించారు.

ఇలా జరగాల్సి ఉన్నా..
ప్రభుత్వం రైతులవద్ద సేకరించిన ధాన్యాన్ని కస్టం మిల్లింగ్ కోసం మిల్లర్లకు కేటాయిస్తుంది. మిల్లర్లు తమకు కేటాయించిన ధాన్యాన్ని బియ్యంగా మార్చి ఎఫ్‌సీఐకి ఇవ్వాలి. అయితే పలు రకాల కారణాలు చూపి ఎప్పటికప్పుడు సీఎంఆర్ ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారు. కొందరు మిలర్లు సీఎంఆర్ బియ్యాన్ని విదేశాలకు ఎగుమతి చేస్తున్నట్లు తెలిసింది.జిల్లాలోని 40 మిల్లుల్లో కొన్ని ఈ తరహా దందా సాగిస్తున్నట్లు అధికారులు గుర్తించింది.

అప్రమత్తమైన మిల్లర్లు
అధికారులు తనిఖీలకు ఉపక్రమించిన నేపథ్యంలో మిల్లర్లు అప్రమత్తం అయ్యారు. కొందరు తమ వద్ద ఉన్న స్టాక్‌ను సీఎంఆర్‌గా చూపుతుండగా.. మరికొందరు బియ్యం నాణ్యత లేవని, మిల్లింగ్‌లో నూకలు ఎక్కువగా వచ్చాయని.. ఇలా రకరకాల కారణాలు చూపుతున్నారు. ఇంకొందరు మిల్లర్లు ప్రైవేట్‌గా రైతుల వద్ద కొనుగోలు చేసిన వడ్లను లెక్క చూపుతున్నారు.



ఆవిర్భావ దినోత్సవం
కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం భువనగిరిలోని జగదేవ్‌పూర్ చౌరస్తాలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న నాయకులు

కాంట్రాక్ట్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరి టౌన్ : జిల్లా సంక్షేమ అధికారి స్పెషలైజ్డ్ అడాప్షన్ ఏజెన్సీ భువనగిరిలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేయడానికి అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బాలల సంరక్షణ అధికారి సైదులు తెలిపారు. yadadri. telangana. gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు ఫారం డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.జనవరి 5న సాయంత్రం 5గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు జిల్లా సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.



భువనగిరిలోని అర్బన్‌కాలనీలో దరఖాస్తులు అందజేస్తున్న ప్రజలు

పండుగలా ప్రజా పాలన

- గ్రామ సభల్లో దరఖాస్తుల స్వీకరణ
- వేలాదిగా తరలివచ్చిన జనం
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, అధికారులు
- తొలిరోజే ఫారాల కొరత

సాక్షి,యాదాద్రి : ఆరు గ్యారంటీల అమలుకోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అభయ హస్తం ప్రజాపాలన కార్యక్రమం గురువారం జిల్లా వ్యాప్తంగా పండుగ వాతావరణంలో ప్రారంభమైంది. గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల్లో నిర్వహించిన సభలకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చిదరఖాస్తు చేసుకున్నారు. సమస్యలు పరిష్కరించేందుకు మున్సిపాలిటీల్లోని అన్ని వార్డుల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశారు.

ప్రారంభించిన ఎమ్మెల్యేలు, అధికారులు
ప్రజాపాలన తొలిరోజున ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, నోడల్ అధికారులు, స్థానిక యంత్రాంగం హాజరై ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఆలేరు మండలం మందనపల్లిలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రజాపాలన గ్రామసభను ప్రారంభించారు. అనంతరం ఆలేరు మున్సిపాలిటీ పరిధిలోని సాయిగూడెం, తుర్కపల్లి మండలం బబ్బునాయక్‌తండా గ్రామ సభల్లో ఆయన పాల్గొన్నారు. మందనపల్లిలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వీరారెడ్డి పాల్గొన్నారు. ఇక భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి వలిగొండ మండలం నాతాళ్లగూడెంలో ప్రజాపాలన గ్రామసభను ప్రారంభించారు. ఆయన వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు ఉన్నారు. అనంతరం సంగెంలో జరిగిన గ్రామసభలో కుంభం పాల్గొన్నారు. రామన్నపేట మండలం నిధానపల్లిలో ప్రజాపాలన గ్రామ సభను ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించారు.

11,132 దరఖాస్తులు
మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో 75 చోట్ల గ్రామసభలు నిర్వహించారు. మొత్తం 11,132 మంది దరఖాస్తు చేసుకున్నారు.

దరఖాస్తు ఫారాల కొరత
ఆరు గ్యారంటీ స్కీంలకు దరఖాస్తు చేసుకోవడానికి తొలిరోజు ప్రజలు పెద్ద ఎత్తున గ్రామ సభలకు తరలివచ్చారు. దీంతో దరఖాస్తు ఫారాల కొరత ఏర్పడింది. గత్యంతరం లేక ప్రజలు జిరాక్స్ సెంటర్లను ఆశ్రయించారు. ఇదే అదనుగా జిరాక్స్ సెంటర్ల నిర్వాహకులు ఒక్కో ఫారానికి రూ.50నుంచి రూ.200 వరకు వసూలు చేసినట్లు బాధితులు తెలిపారు. అదే విధంగా ఆలేరు మున్సిపాలిటీ పరిధిలో దరఖాస్తు ఫారాలు ఒక వైపే ముద్రించి రావడంతో ప్రజలు గందరగోళానికి గురయ్యారు.

సాగునీటి ప్రాజెక్టులపై దృష్టి సారించండి

- ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి : జిల్లాలో పెండింగ్ సాగునీటి ప్రాజెక్టుల పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆశాఖ అధికారులతో సమావేశమై సాగునీటి ప్రాజెక్టులపై సమీక్షించారు. బస్వాపూర్ రిజర్వాయర్, ప్యాకేజీ–16 కాలువలు, బునాదిగాని, పిల్లాయపల్లి, ధర్మారెడ్డిపల్లి, భీమలింగం కాలువల పనుల పురోగతిపై తెలుసుకున్నారు. బస్వాపూర్ రిజర్వాయర్, కాలువల భూసేకరణపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బునాదిగాని, పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాలువల పెండింగ్ పనులను పూర్తి చేయడానికి యుద్ధప్రాతిపదికన అంచనా ప్రతిపాదనలను సిద్ధం చేయాలని పేర్కొన్నారు. కాగా బీఎస్ తిమ్మాపూర్ గ్రామ కంఠం భూసేకరణకు రూ.110 కోట్లు, వ్యవసాయ భూముల పరిహారానికి రూ.102.48 కోట్లు, హుస్నాబాద్ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కోసం రూ.50 కోట్లు అవసరమని ఎమ్మెల్యేకు అధికారులు నివేదించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, బస్వాపూర్ ప్రాజెక్టు ఎస్ఈ శ్రీనివాస్, ఆర్డీఓలు జగన్నాథరావు, అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.



నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భద్రతపై ఏదీ భరోసా?

2023లో పెరిగిన క్రైం రేట్
- అత్యధికంగా 'సైబర్' మోసాలు
- జోరుగా మత్తు పదార్థాల విక్రయం
- మహిళల హత్యలు, ఆత్మహత్యలు, కిడ్నాప్‌లు
- పెద్ద ఎత్తున మిస్సింగ్ కేసులు నమోదు
- దొంగతనాలకు కొంతమేర అడ్డుకట్ట



సాక్షి యాదాద్రి : భువనగిరి జోన్ పరిధిలో ఈ ఏడాది నేరాలు పెరిగాయి. ప్రధానంగా సైబర్ నేరాలు 25శాతం అధికం అయ్యాయి. మహిళల హత్యలు, ఆత్మహత్యలతో పాటు మిస్సింగ్ కేసులు ఎక్కువయ్యాయి. గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయానికి అడ్డు లేకుండాపోయింది. అయితే గృహహింస, పోక్సో కేసులతో పాటు దొంగతనాలు కొంత మేరకు తగ్గాయి. మొత్తంగా గత ఏడాదితో పోల్చుకుంటే 6.5శాతం నేరాలు పెరిగాయి.

వల వేస్తున్న సైబర్ నేరగాళ్లు
ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరాలు కూడా అధికం అవుతున్నాయి. ఆన్‌లైన్ బ్యాంకింగ్, ఆండ్రాయిడ్ ఫోన్‌ల ద్వారా చెల్లింపులు, ఆన్‌లైన్ పెట్టుబడులు, రుణాలు ఇస్తామని, బహుమతులు వచ్చాయని, లాటరీ తగిలిందని, ఆధార్ కార్డు, పాన్‌కార్డు డేటా స్టీలింగ్‌తో ఆన్‌లైన్‌లో సైబర్ నేరగాళ్లు ఆర్థిక నేరాలకు పాల్పడుతూ బాధితుల ఖాతాల్లో నగదు కాజేస్తున్నారు. ఇవే కాకుండా ఓలెక్స్, క్వికర్, ఇతర మార్కెటింగ్ వ్యవస్థల పేరుతో, సెల్‌ఫోన్ డేటా చౌర్యం చేసి డబ్బులు దోచుకుంటున్నారు. ఆర్థికంగా నష్టపోయిన కొందరు ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు ఉన్నాయి. ఇందులో కొన్ని కేసులు నమోదవుతున్నా వెలుగులోకి ఘటనలు మరెన్నో ఉన్నాయి.

ఆన్‌లైన్ గేమ్స్‌తో అప్పులపాలు, ఆత్మహత్య
ఆన్‌లైన్ గేమ్‌కు అలవాటు పడి కొందరు యువకులు కుటుంబ సభ్యులకు తెలియకుండా పెద్ద ఎత్తున అప్పులు చేశారు. చౌటుప్పల్‌కు చెందిన అవిశెట్టి రాజేశ్వరి ఆన్‌లైన్ గేమ్ కోసం రూ.10లక్షలు అప్పు చేసి ఆత్మహత్యకు పాల్పడింది. తన కుమారులు అనిరుధ్, హర్షవర్ధన్‌లను సైతం నీటి సంపులో ముంచి తాను అదే సంపులో దూకి ఆత్మహత్య చేసుకుంది. వెలుగులోకి రాని మరికొన్ని ఘటనలు ఉన్నాయి.



పంతంగి టోల్‌ప్లాజా వద్ద పట్టుబడిన గంజాయిని పరిశీలిస్తున్న సీపీ డీఎస్ చౌహాన్ (ఫైల్)

నకిలీ విత్తనాలు స్వాధీనం
- చౌటుప్పల్‌లోని నవత ఆగ్రో డివిజన్ ఎరువుల షాపులో భారీగా నకిలీ విత్తనాలు పట్టుకున్నారు.
- నిషేధిత బీటీ, త్రిహెచ్‌టీ విత్తనాలు రెండు టన్నులకు పైగా స్వాధీనం చేసుకున్నారు.

మహిళలపై ఆగని అఘాయిత్యాలు
మహిళల హత్యలు, వరకట్న కేసులు పెరిగాయి. కిడ్నాప్‌లు, మిస్సింగ్ కేసులు ఎన్నడూ లేని విధంగా నమోదయ్యాయి. మిస్సింగ్ కేసుల్లో 75 శాతం ప్రేమ వ్యవహారాలకు సంబంధించనవేనని పోలీసు రికార్డులు చెబుతున్నాయి.అయితే ఆత్మహత్యలు, గృహహింస, పోక్సో కేసులు కొంత వరకు తగ్గాయి.

చోరీలు, సొత్తు రికవరీ
దొంగతనాలకు సంబంధించి 105 కేసులు నమోదయ్యాయి. నిందితుల నుంచి రూ.84,41,900 నగదు రికవరీ చేశారు.

తగ్గిన రోడ్డు ప్రమాదాలు
2023లో రోడ్డు ప్రమాదాలు తగ్గాయి. మేజర్‌గా చౌటుప్పల్ మండలం దండు మల్కాపురంలోని గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కు వద్ద ఫిబ్రవరి 16న కంపెనీలోకి మహిళా కార్మికులతో వెళ్తున్న ఆటోను ప్రైవేట్ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారం గ్రామానికి చెందిన నలుగురు కూలీలు మృతిచెందారు.

లోక్ అదాలత్‌లో 2,322 కేసులు నమోదు
జిల్లా కోర్టుల్లో ఈ ఏడాది మూడు దఫాలు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా 2,322 కేసులు రాజీ కుదిర్చారు. 20,733 ఈ పెట్టి కేసులు పరిష్కరించారు.

2023లో కేసులు ఇలా..

ఫిర్యాదులు	13,006
పరిష్కారం	12,808
నమోదైన కేసులు	4,901
పరిష్కారం	1,664
శిక్షలు పడినవి	225
ఎన్‌బీడబ్ల్యూ కేసులు	924
100 కాల్స్	32,147
సైబర్ క్రైమ్స్	49
ఫ్యామిలీ కౌన్సెలింగ్	620
జీరో ఎఫ్ఐఆర్‌లు	35
చిన్నపాటి నేరాలు	1,584

దొంగతనాలకు అడ్డుకట్ట



భువనగిరిలోని ఓ ఇంట్లో వస్తువులను చిందరవందరగా పడేసిన దొంగలు (ఫైల్)

ఈ ఏడాది దొంగతనాలు కొంతవరకు తగ్గాయి. తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసి నిందితులు చోరీలకు పాల్పడ్డారు. జిల్లాలో సీసీఎస్ పోలీసులు 105 కేసులు నమోదు చేసి నిందితుల నుంచి రూ.84.41,900 రికవరీ చేశారు. ఇంకా పలు చోరీలకు సంబంధించి పోలీసుల విచారణ కొనసాగుతోంది. పోలీసుల నిఘా, సీసీ కెమెరాల ఏర్పాటుతో దొంగతనాలు గతంతో పోల్చుకుంటే తగ్గుముఖం పట్టాయి. జిల్లా వ్యాప్తంగా కమ్యూనిటీ సీసీ కెమెరాలు 2,630, నేను సైతంలో 12,288 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

విచ్చలవిడిగా మత్తుపదార్థాల రవాణా, వినియోగం

జిల్లాలో మునుపెన్నడూ లేని విధంగా మత్తు పదార్థాల రవాణా, వినియోగం పెరిగింది. మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు రాచకొండ పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నప్పటికీ అక్రమార్కులు వారి కళ్లుగప్పి గంజాయి ఇతర మత్తు పదార్థాలను తరలిస్తున్నారు. వీటిని వినియోగించే వారు అధికం అయ్యారు. ప్రధానంగా గంజాయి, హీష్ ఆయిల్, ఓపీఎం, హెరాయిన్, పాపీస్ట్రో, ఎక్స్‌టెపిల్స్, ఎన్ఎస్‌డీ పేపర్స్, నైట్రావిటా టాబ్లెట్స్, ఓసీబీ పాకెట్స్, చెరాన్‌బాల్స్, చెరాన్‌పౌడర్ వంటి మత్తు పదార్థాలు ఇతర రాష్ట్రాల నుంచి జిల్లా మీదుగా రవాణా జరుగుతోంది. టోల్‌ప్లాజాలు, చెక్‌పోస్టుల వద్ద పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో గంజాయి ఇతర మాదక ద్రవ్యాలు పెద్ద ఎత్తున పట్టుబడిన సందర్భాలు ఉన్నాయి.

పట్టుబడ్డ గంజాయి ఘటనలు కొన్ని..
- ఆంధ్రప్రదేశ్ నుంచి మహారాష్ట్రలోని సోలాపూర్‌కు 232 కిలోల గంజాయి తరలిస్తుండగా అడ్డగూడూరు మండలం చౌళ్లరామారం వద్ద పోలీసులు పట్టుకున్నారు. ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి నుంచి బొలెరో వాహనం, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.
- ఆంధ్రప్రదేశ్‌లోని సీలేరు నుంచి మహారాష్ట్రకు 200 కిలోల గంజాయిని తరలిస్తుండగా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్ ప్లాజా వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఆరుగురు నిందితులను అరెస్టు చేసి రెండు కార్లు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.
- చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద నాలుగు కిలోల గంజాయి పట్టుకున్నారు. నిందితుల నుంచి రెండు సెల్‌ఫోన్లు, రూ.15వేలు స్వాధీనం చేసుకున్నారు.
- పంతంగి టోల్‌ప్లాజా వద్ద 200 కిలోల గంజాయి పోలీసుల తనిఖీల్లో పట్టుపడింది. గంజాయి తరలిస్తున్న కారును పోలీసులు స్వాధీనం చేసుకొని నిందితులను అరెస్టు చేశారు.

నేరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు



“ నేరాల నియంత్రణకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాం. జిల్లా వ్యాప్తంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. నేరస్తులను సులువుగా గుర్తించడంలో సీసీ కెమెరాలు ఎంతో దోహదపడుతున్నాయి. వీటితో పాటు నేరస్తులను గుర్తించేందుకు సీసీఎస్, ఐటీసెల్ సహకారం తీసుకుంటున్నాం. నేర నిరూపణ సమయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తూ కేసులను ఛేదిస్తున్నాం.

–రాజేశ్‌చంద్ర, డీసీపీ

న్యూస్‌రీల్

'విజన్ భువనగిరి'ని జయప్రదం చేయాలి

భువనగిరి : విజన్ భువనగిరి పార్లమెంట్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలో శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.స్థానిక ఎస్ఎల్ఎన్ఎస్ ఫంక్షన్ కన్వెన్షన్ హాల్‌లో ఉదయం 10.30 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు, ప్రజలు, మేధావులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఉపాధ్యాయురాలిపై డీఈఓకు ఫిర్యాదు

బీబీనగర్ : మండలంలోని కొండమడుగు గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఇంగ్లిష్ ఉపాధ్యాయురాలిపై విద్యార్థిని తండ్రి గురువారం డీఈఓకు ఫిర్యాదు చేశారు. పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న జిన్న ప్రణవి పట్ల ఉపాధ్యాయురాలు దురుసుగా ప్రవర్తించడంతో పాటు చితకబాదినట్లు విద్యార్థిని తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. విద్యార్థులందరి పట్ల దురుసుగా వ్యవహరిస్తుందని, కొడుతుందని గతంలోనూ ఆమెపై ఫిర్యాదులు ఉన్నాయన్నారు. ఉపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజలు సహకరించాలి



మోదుబావిగూడెంలో ప్రజాపాలన గ్రామసభను పరిశీలిస్తున్న డీసీపీ

ఆత్మకూరు(ఎం): ప్రజాపాలన కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని డీసీపీ రాజేష్‌చంద్ర పేర్కొన్నారు. ఆత్మకూర్(ఎం) మండలంలోని మోదుబావిగూడెంలో గురువారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ప్రజాపాలన కార్యక్రమాల వద్ద ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఆయన వెంట ఏసీపీ వాసు, సీఐ మధుకుమార్, ఎస్ఐ దొమ్మేటి నాగరాజు ఉన్నారు.

మోత్కూరు: మండలంలోని రాగిబావి, పనకబండ గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమాన్ని డీసీపీ రాజేశ్‌చంద్ర పరిశీలించారు. అధికారులు, ప్రజలకు సూచనలు చేశారు. పనకబండలో 140, రాగిబావి గ్రామంలో 42 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి యాదయ్య, ఎంపీడీఓ మనోహర్‌రెడ్డి, తహసీల్దార్ రాంప్రసాద్, సర్పంచులు రాంపాక నాగయ్య, బత్తిని తిరుమలేష్, ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి, డీటీ, ఆర్ఐ తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలపై ప్రభుత్వంతో మాట్లాడండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

భువనగిరిటౌన్ : ప్రభుత్వంతో మాట్లాడి ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, మెస్, కాస్మొటిక్ చార్జీలు విడుదల చేయించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు గురువారం ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వనం రాజు మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యారంగం అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతుందన్నారు. గత ప్రభుత్వం హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచుతున్నట్లు ప్రకటించిందే తప్ప.. అమలు చేయలేదన్నారు. అంతేకాకుండా 16 నెలలుగా మెస్, కాస్మొటిక్ చార్జీలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.7,792 కోట్లు పెండింగ్ ఉందని, వెంటనే విడుదల చేయించాలని, గురుకులాలకు, సంక్షేమ హాస్టళ్లకు నూతన భవనాలు నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చింతల శివ, లావుడియా రాజు, వేముల నాగరాజు, వేముల జ్యోతి వాసు, బుగ్గ ఉదయ్, పుట్టల ఉదయ్, ఎండీ నేహాల్ పాల్గొన్నారు.

తెలంగాణ ఫుట్‌బాల్ జట్టు కెప్టెన్‌గా వెంకటసాయి

నల్లగొండ టూటౌన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయ స్థాయి బాలుర ఫుట్‌బాల్ తెలంగాణ జట్టు కెప్టెన్‌గా నల్లగొండలోని ఛత్రపతి శివాజీ ఫుట్‌బాల్ క్లబ్ క్రీడాకారుడు రాచూరు వెంకటసాయి ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి పోటీల్లో వెంకటసాయి ఉత్తమ ఆటతీరు కనబర్చాడు.


నల్లగొండ వెటర్నరీ కార్యాలయం వద్ద గురువారం ఏర్పాటు చేసిన ప్రజాపాలనలో అధికారులకు దరఖాస్తులు సమర్పిస్తున్న లబ్ధిదారులు


సూర్యాపేట పట్టణంలో దరఖాస్తులు అందజేసేందుకు వచ్చిన లబ్ధిదారులు


వలిగొండ: నాతాళ్లగూడెంలో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి హాజరైన గ్రామస్తులు


వలిగొండ: నాతాళ్లగూడెంలో దరఖాస్తులు తీసుకుంటున్న ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి


మోటకొండూర్: కాటేపల్లిలో లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ఐలయ్య


తిరుమలగిరి: బండ్లపల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సామేల్, కలెక్టర్ వెంకట్రావ్


మిర్యాలగూడ: ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి దరఖాస్తులు అందజేస్తున్న లబ్ధిదారులు


నకిరేకల్: బాబాసాహెబ్‌గూడెంలో ఎమ్మెల్యే వీరేశానికి దరఖాస్తులు అందజేస్తున్న దివ్యాంగులు


వలిగొండ: దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన వృద్ధురాలు

క్లుప్తంగా

64 క్వింటాళ్ల ధాన్యం చోరీ

శాలిగౌరారం: రైతులు నిల్వ చేసుకున్న 64 క్వింటాళ్ల బీపీటీ ధాన్యాన్ని గురువారం గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. మండలంలోని గురుజాల గ్రామానికి చెందిన సుమారు 30 మంది రైతులు తమ కుటుంబ ఆహార నిల్వల కోసం ధాన్యాన్ని గ్రామసమీపంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు చేసే స్థలంలో ఆరబెట్టుకుంటున్నారు. ఈక్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు ట్రాలీ వాహనంలో గ్రామానికి చెందిన ననుబోతు సోమమల్లుకు చెందిన 12 క్వింటాళ్లు, ననుబోతు రమేశ్‌కు చెందిన 12 క్వింటాళ్లు, ఎల్మకంటి వెంకటనారాయణ 8 క్వింటాళ్లు, ముత్యాల పర్వతాలు 8 క్వింటాళ్లు, ముత్యాల రమేశ్ 5 క్వింటాళ్లు, ముత్యాల శంభులు 4 క్వింటాళ్లు, ఉమ్మల్‌రెడ్డి దేవిరెడ్డి 5 క్వింటాళ్లు, ఉమ్మల్‌రెడ్డి గోపాల్‌రెడ్డి రెండు క్వింటాళ్లు, ఉమ్మల్‌రెడ్డి సంజీవరెడ్డి 6 క్వింటాళ్లు, మోసోజు సత్యనారాయణకు చెందిన రెండు క్వింటాళ్లు చోరీకి గురయ్యాయి. ధాన్యం విలువ రూ.2.25 లక్షలు ఉంటుందని రైతులు పేర్కొన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. ఈమేరకు ఎస్‌ఐ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

లారీ ఢీకొని ఒకరి మృతి

మఠంపల్లి: మండలంలోని బక్కమంతులగూడెం వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. మఠంపల్లి ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. పాలకీడు మండలం అలింగాపురానికి చెందిన యడ్లపల్లి వెంకటేశ్వర్లు (55) వ్యక్తిగత పని నిమిత్తం హుజూర్‌నగర్‌కు మోటార్‌సైకిల్‌పై వచ్చాడు. పని ముగించుకుని మఠంపల్లి మీదుగా స్వగ్రామానికి వెళ్తుండగా బక్కమంతులగూడెం సమీపంలో మఠంపల్లి నుంచి హుజూర్‌నగర్ వైపు వస్తున్న లారీ ప్రమాదవశాత్తు ఎదురుగా వచ్చి ఇతని బైక్‌ను ఢీకొట్టింది. దీంతో వెంకటేశ్వర్లు మోటార్‌సైకిల్‌తో సహా రోడ్డుపై పడి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి బావమరిది జమ్మిగుంపుల శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


మృతిచెందిన వెంకటేశ్వర్లు

25 కేజీల గంజాయి పట్టివేత

- ఇద్దరు అరెస్టు, పరారీలో మరో నిందితుడు
- కేసు వివరాలు వెల్లడించిన ఏఎస్పీ

సూర్యాపేట క్రైం: గంజాయిని హైదరాబాద్‌కు తరలిస్తున్న ముగ్గురిని సూర్యాపేట పట్టణ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసుకు సంబంధించిన వివరాలను గురువారం సూర్యాపేట జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు వెల్లడించారు. గురువారం సూర్యాపేటలోని ఎన్టీఆర్ పార్క్ వద్ద అనుమానాస్పదంగా ఆపి ఉన్న రెండు కార్లను పెట్రోలింగ్ సిబ్బంది గుర్తించి అధికారులకు సమాచారం ఇచ్చారు. సిబ్బంది కార్లను తనిఖీ చేయగా ఒక కారులో 24కేజీ గంజాయి, మరో కారులో 1 కేజీ గంజాయి ఉంది. ఇద్దరినీ అదుపులోకి తీసుకోగా మరో వ్యక్తి పరారయ్యాడు. నిందితులు నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం, వటవర్లపల్లి గ్రామానికి చెందిన చెందిన చారగొండ ప్రకాష్, మిర్యాలగూడ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన తాళ్ల సుమంత్‌గా గుర్తించారు. మరో నిందితుడు భార్గవ రామ్ పరారయ్యాడు. ప్రకాష్, సుమంత్‌లు 5 సంవత్సరాలుగా స్నేహితులు. నాగర్‌కర్నూల్‌కు చెందిన ప్రకాష్ సొంత గ్రామంలో వ్యవసాయం చేస్తుంటాడు. మిర్యాలగూడకు చెందిన సుమంత్‌కు గంజాయి తాగే అలవాటు ఉంది. గంజాయి సాగు చేస్తే హైదరాబాద్‌లో విక్రయించి ఎక్కువ లాభం అర్జించవచ్చని సుమంత్ ప్రకాష్ చేత గంజాయి తోట వేయించాడు. రెండు రోజుల క్రితం గంజాయి తెంపిన తర్వాత ప్రకాష్ సుమంత్‌కు సమాచారం ఇచ్చాడు. ఈనెల 27న సుమంత్ కారులో ప్రకాష్ గ్రామమైన వటవర్లపల్లికి వెళ్లి గంజాయి ఆయన కారులో పెట్టుకుని సుమంత్ అత్తగారు ఊరైన సూర్యాపేట పట్టణానికి వచ్చాడు. రాత్రి సూర్యాపేటలో ఉండి ఉదయం సుమంత్ స్నేహితుడైన హైదరాబాద్‌కు చెందిన భార్గవ్ రామ్‌కి ఫోన్ చేసి సూర్యాపేటకు రమ్మన్నారు. భార్గవ్‌రామ్ సూర్యాపేట పట్టణం ఎన్టీఆర్ పార్క్ వద్దకు వచ్చారు. అయితే ఇక్కడ అనుమానాస్పదంగా ఉన్న వీరిని పోలీసులు అదుపులోకి తీసుకుని 25కేజీల గంజాయి, 2 కార్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకున్న సీఐలు రాజశేఖర్, నాగార్జున, ఎస్‌ఐలు సైదులు, రవీందర్, పట్టణ క్రైమ్ సిబ్బందికి రివార్డ్ అందిస్తామని ఏఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ రాజశేఖర్, ఎస్‌ఐ రవిందర్, సిబ్బంది గొర్ల కృష్ణ, గోదేసి కరుణాకర్, జె.సైదులుగౌడ్, అనిల్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.


గంజాయి, నిందితులను చూపుతున్న ఏఎస్పీ నాగేశ్వరరావు

ఇల్లు ఇప్పించండి సారూ..

డిండి: కొంత కాలం క్రితం భర్త చనిపోయాడు.. పిల్లలెవరూ లేరు. అనాథగా ఉన్న ఓ వృద్ధురాలు ఉండడానికి ఇల్లు కూడా లేదు. చిన్న గుడిసెలో నివాసం ఉంటుంది. తనకు ఇల్లు ఇప్పించాలని ప్రజాపాలనకు వచ్చిన అధికారులను వేడుకుంది. డిండి పట్టణానికి చెందిన వృద్ధురాలు చింతపల్లి సాయమ్మ స్థానిక అయ్యప్ప ఆలయ సమీపంలో రేకులతో నివాసం ఏర్పాటు చేసుకుంది. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజా పాలనకు వచ్చింది. అధికారులకు రెండు చేతులు జోడించి తాను ఉండటానికి గూడు లేక పడుతున్న బాధను వివరించింది. స్పందించిన సర్పంచ్ మేకల సాయమ్మ, గ్రామ కార్యదర్శి సతీష్‌చంద్ర ఇంటి కోసం దరఖాస్తు చేసుకోవాలని, సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఇల్లు నిర్మించి ఇచ్చే విధంగా చూస్తామని పేర్కొన్నారు.


ఇల్లు ఇప్పించాలని కోరుతున్న వృద్ధురాలు

11,500 హెక్టార్లలో అటవీ భూములు

నడిగూడెం : జిల్లాలో 11,500 హెక్టార్లలో అటవీ భూములు ఉన్నాయని జిల్లా అటవీశాఖ అధికారి, నడిగూడెం మండల ప్రత్యేక అధికారి వి.సతీష్‌కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని తెల్లబల్లిలో ఆయన మాట్లాడారు. మఠంపల్లి, పాలకవీడు, మేళ్లచెరువు, చింతలపాలెం మండలాలలో అటవీ భూములుండగా, సూర్యాపేట, చింతలపాలెంలో కొంత రిజర్వు అటవీ భూములున్నట్లు తెలిపారు. మూడు రేంజ్‌లు, 8 మంది సెక్షన్ అధికారులు, 12మంది బీట్ అధికారులు ఈ భూములను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యామ్నాయ అటవీ భూములు మునగాల, చిలుకూరు, సూర్యాపేట, నాగారం, జాజిరెడ్డిగూడెం, చింతలపాలెం, మేళ్లచెరువు మండలాల్లో ఉన్నట్లు, ఈ భూములకు ఫెన్సింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

గ్యాస్ ఈకేవైసీ కోసం బారులు


మోత్కూరులోని భారత్ గ్యాస్ ఏజెన్సీ ఎదుట బారులుదీరిన మహిళలు

మోత్కూరు, ఆలేరు రూరల్ : గ్యాస్ సిలిండర్ రూ.500కే అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో గ్యాస్ ఏజెన్సీల వద్ద ఈకేవైసీ కోసం లబ్ధిదారులు బారులుదీరుతున్నారు. గురువారం మోత్కూరులోని భారత్ గ్యాస్ కార్యాలయానికి మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి క్యూలో నిల్చున్నారు. కార్యాలయం వద్ద వారం రోజులుగా కార్యాలయం వద్ద ఇదే తంతు కొనసాగుతోంది. అదే విధంగా ఆధార్ కార్డులో మార్పుల కోసం ఆలేరులోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ ఎదుట ప్రజలు పడిగాపులు కాశారు. ఇదే సమయంలో సర్వర్ మొరాయించడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

మున్సిపల్ వైస్ చైర్మన్‌కు కన్నీటి వీడ్కోలు

- బాపూజీనగర్ స్మశానవాటికలో అంత్యక్రియలు పూర్తి
- అంతిమ యాత్రలో పాల్గొన్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

మిర్యాలగూడ అర్బన్: బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ కుర్రా కోటేశ్వర్‌రావు (విష్ణు) అంత్యక్రియలు గురువారం మిర్యాలగూడలోని బాపూజీనగర్ స్మశానవాటికలో హిందూ సంప్రదాయ ప్రకారం నిర్వహించారు. గుండెపోటుతో మృతిచెందిన ఆయనను కడసారి చూసేందుకు అభిమానులు, ప్రజలు నివాసానికి భారీగా చేరుకున్నారు. పట్టణంలోని బంగారుగడ్డలో ఉన్న ఆయన నివాసం నుంచి ప్రధాన వీధుల గుండా అంతిమ యాత్ర సాగింది.

మాజీ మంత్రి పరామర్శ..

మున్సిపల్ వైస్ చైర్మన్ కోటేశ్వర్‌రావు మృతికి మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి సంతాపం తెలిపారు. తమ పార్టీ విలువైన కార్యకర్తను కోల్పోయిందని, ఆయన పార్టీకి చేసిన సేవలు మరువలేనివన్నారు. విష్ణు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. అంతిమయాత్రలో భాగంగా మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, ఎన్‌బీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నల్లమోతు సిద్దార్థ స్వయంగా పాడె మోసి తమ అభిమానాన్ని చాటుకున్నారు.


అంతిమయాత్రలో పాల్గొన్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి తదితరులు


పాడె మోస్తున్న నల్లమోతు భాస్కర్‌రావు, సిద్దార్థ

రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్న కైలాస్ నేత

మునుగోడు: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం శ్రమించే ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి రాష్ట్ర మంత్రి వర్గంలో అవకాశం కల్పించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్న కైలాస్ నేత అధిష్టానాన్ని కోరారు. గురువారం మునుగోడులో ఆయన విలేకర్లతో మాట్లాడారు. గత కొన్నేళ్లుగా మునుగోడు నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇస్తే చర్లగూడెం, కిష్టరాయిపల్లి రిజర్వాయర్లు పూర్తిచేస్తారని, దీంతో అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, పట్టణ అధ్యక్షుడు సాగర్ల లింగస్వామి, పందుల భాస్కర్, బొల్లం వెంకన్న, పందుల అశోక్, మల్లేష్, ఎండీ అన్వర్, ఇటికలపాటి మధు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కైలాస్ నేత

విధుల్లో ఉన్న అటెండర్ మృతి

రామగిరి(నల్లగొండ): విధి నిర్వహణలో ఉన్న అటెండర్ అకస్మాత్తుగా మృతి చెందిన సంఘటన గురువారం తిప్పర్తి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. చిట్యాల మండలంలోని ఎలికట్టె గ్రామానికి చెందిన పుట్ట జయమ్మ(60) గత 12 సంవత్సరాలుగా తిప్పర్తి మండల తహసీల్దార్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తోంది. గురువారం మధ్యాహ్నం తనకు అనారోగ్యంగా ఉందని సహ ఉద్యోగులతో చెప్పి కార్యాలయంలో నిద్రించింది. భోజన విరామ సమయంలో కార్యాలయ సిబ్బంది జయమ్మను నిద్ర లేపడానికి ప్రయత్నించగా లేవలేదు. 108 వాహనానికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది అక్కడకు చేరుకుని ఆమెను పరిశీలించి మృతి చెందినట్లు గుర్తించారు. దీంతో మృతురాలి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని ఆమె సొంత గ్రామానికి తీసుకెళ్లారు.

రోగి వద్ద బంగారు ఆభరణాలు చోరీ

నాగార్జునసాగర్: స్థానిక కమలానెహ్రూ ఏరియా ఆస్పత్రిలో ఈనెల 21న తెల్లవారుజామున రమణమ్మ అనే పేషెంట్ మెడలో ఉన్న బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. ఈ సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల ప్రకారం.. సాగర్‌కు చెందిన రమణమ్మ అనారోగ్యంతో ఉండడంతో కుటుంబసభ్యులు ఈనెల 17న ఆస్పత్రిలో చేర్పించారు. 21వ తేదీ తెల్లవారుజామున రమణమ్మ కుమార్తె రమాదేవి బాత్‌రూంకు వెళ్లి వచ్చి చూడగా తల్లి మెడలో ఉన్న బంగారు గొలుసు, లక్ష్మీకాసులు, గాజులు, 8 గుండ్లు, తాలిబొట్టు మొత్తం 8తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. వెంటనే సంబంధిత ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు తెలియజేసింది. అదేవిధంగా 22న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రమణమ్మ అల్లుడు రామ్మోహన్‌రావు తెలిపారు. అయితే అపస్మారక స్థితిలో ఉన్న రమణమ్మ అదే రోజున మృతిచెందింది. బంగారు ఆభరణాలు అపహరణకు గురైన రోజున ఆస్పత్రిలో విధుల్లో ఉన్న ఉద్యోగులు, పేషెంట్ల వివరాల జాబితాను పోలీసులకు అప్పగించినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ భానుప్రకాశ్ తెలిపారు. ఈమేరకు సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఎస్‌ఐ సంపత్‌గౌడ్ మాట్లాడుతూ పేషెంట్ వృద్ధురాలిని అపస్మారక స్థితిలో ఉన్న సమయంలో ఆస్పత్రికి తీసుకువచ్చి ప్రత్యేక గదిలో ఉంచారని, వారి కుటుంబ సభ్యులు, డాక్టర్లు, నర్సులు మినహా ఎవరూ అక్కడకు వెళ్లినట్లు సీసీ కెమెరాల్లో నమోదు కాలేదని చెప్పారు. ఆమెను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకువచ్చారని, అందులో ఏమైనా మిస్సయ్యాయా అనే కోణంతో దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కలుపు యాజమాన్యం పాటించాలి

- వరిసాగులో కలుపు నివారణపై వ్యవసాయాధికారి రాజగోపాల్‌రావు సూచనలు


పాడి పంట

నడిగూడెం: ప్రస్తుత రబీ సీజన్‌లో బోర్లు, బావులు, చెరువుల ద్వారా వేసిన వరి నాట్ల పనులు పూర్తికావచ్చాయి. వరి సాగు చేసే రైతులు ఎదుర్కొనే సమస్యల్లో ముఖ్యమైనది కలుపు నివారణ. పొలంలో కలుపు కారణంగా రైతులు తగిన దిగుబడులు పొందలేక తీవ్రంగా నష్టపోతుంటారు. దిగుబడిపై తీవ్రంగా ప్రభావితం చేసే కలుపును నివారించడానికి సకాలంలో చర్యలు తీసుకోవడం ద్వారా నష్టాన్ని తగ్గించుకోవచ్చు. వరి సాగులో ప్రధానంగా కలుపు యాజమాన్యం పాటించాలని నడిగూడెం మండల వ్యవసాయాధికారి రాజగోపాల్‌రావు పేర్కొంటున్నారు. సలహాలు, సూచనలు ఆయన మాటల్లోనే..

నేరుగా విత్తిన వరి పొలంలో..

ఈ పద్ధతిలో 24-48 గంటలు నానబెట్టి మొలక కట్టిన వరి విత్తనాన్ని విత్తేటప్పుడు ఈ మందుల్లో ఏదైన ఒక దానిని వాడాలి.

- ప్రెటిలాక్లోర్ +సేఫ్‌నర్ మందును ఎకరానికి 600 మి.లీ. నుంచి 800 మి.లీ.వరకు విత్తిన 3 నుంచి 5 రోజులలోపు వాడాలి.
- పైరజోసల్ఫ్యూరాన్ ఈథైల్ మందును ఎకరానికి 80-100 గ్రాములు, విత్తిన 8-10 రోజులలోపు వాడాలి. ఇది గడ్డిజాతి కలుపు మొక్కలను నివారిస్తుంది.
- బ్యూటాక్లోర్ 1-1.25 లీటర్లు లేదా ప్రెటిలాక్లోర్ మందును 500 మి.లీ. ఎకరానికి వాడాలి.
- సైహలోఫాప్ పి.బ్యుటైలా కలుపు మందును ఎకరానికి 300 మిల్లీ లీటర్లు విత్తిన 15-20 రోజులలోపు వాడుకోవాలి.
- ఫినాక్స్ ప్రాప్ పి.ఈథైల్ మందును ఎకరానికి 250 మి.లీ చొప్పున విత్తిన 15-20 రోజులకు వాడుకోవాలి.


కలుపు మందు చల్లుతున్న రైతు

గడ్డి జాతి కలుపు నివారణకు నాటిన 15 నుండి 20 రోజులకు వాడాల్సిన కలుపు మందులు

- సైహలో పి.బ్యూటైల్ 300 మి.లీ. ఒక ఎకరానికి లేదా ఫినాక్స్‌ప్రాప్ పి.ఇథైల్ ఒక ఎకరానికి లేదా మెట్ సల్ఫ్యూరాన్ మిథైల్ - క్లోరిమ్యూరాన్ ఇథైల్ అనే మందును 8 గ్రాములు ఒక ఎకరానికి వాడాలి.

నాటిన 3 నుంచి 5 రోజులలోపు వాడే కలుపు మందులు..

- బ్యూటాక్లోర్ 1-1.25 లీటర్లు లేదా ప్రెటిలాక్లోర్ 400 మి.లీ. నుంచి 600 మి.లీ. లేదా ఆక్సడయార్జిల్ 35-45 గ్రాములు ఎకరానికి వాడాలి.
- బెన్ సల్ఫ్యూరిక్ మిథైల్ (0.6 శాతం)+ ప్రెటిలాక్లోర్ (6.0వాతం) ఎకరానికి నాలుగు కిలోల గుళికలు వాడాలి.
- పైరజోసల్ఫ్యూరాన్ ఇథైల్ 80-100 గ్రాములు వాడాలి. ఈ మందుల్లో ఏదైనా ఒక దానిని 20 కిలోల ఇసుకలో కలిపి చల్లుకోవాలి.

గడ్డిజాతి మరియు వెడల్పాకు కలుపు నివారణకు..

- బిస్‌పైర్ బాక్ సోడియం ఎకరానికి 100 మి.లీ. అనగా లీటరు నీటికి 0.5. మి.లీ. మందును కలిపి 15 నుండి 20 రోజుల మధ్య పిచికారీ చేసుకోవాలి.
- తుంగ జాతి, వెడల్పాకు కలుపు నివారణకు మైట్‌సల్ఫ్యూరాన్ మిథైల్ + క్లోరిమ్యురాన్ ఇథైల్ 8 గ్రా ఒక ఎకరానికి చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

విద్యుదాఘాతంతో ముగ్గురికి తీవ్రగాయాలు

మునుగోడు: పార్టీ జెండా కడ్డీని దిమ్మెలో కూర్చోబెడుతుండగా ముగ్గురు వ్యక్తులు విద్యుత్ షాక్‌కు గురై తీవ్రగాయాల పాలయ్యారు. ఈ సంఘటన మునుగోడు మండలం కోతులారం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది.వివరాల ప్రకారం.. కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ గ్రామ కూడలిలో గల పార్టీ దిమ్మె వద్ద సాయంత్రం కార్యకర్తలు జెండా ఎగురవేసేందుకు సిద్ధమయ్యారు. జెండా ఇనుప కడ్డీని ఉదయం కిందకు దింపి రంగులు వేశారు. సాయంత్రం ఎగురవేసే సమయంలో కొండోజు నర్సింహ, బుంగమట్ల పరుశురాం, పందుల అశోక్‌లు జెండా కడ్డీని పైకి లేపి దిమ్మెలో కూర్చోపెడుతుండగా పైభాగం 11 కేవీ విద్యుత్ వైర్‌కు తగిలింది. దీంతో షాక్‌కు గురై కిందపడిపోయారు. తీవ్ర గాయాలు కావడంతో అక్కడే ఉన్న కార్యకర్తలు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. అందులో నర్సింహ, పరుశురాంల పరిస్థితి విషమంగా ఉందని తెలిసింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

7 ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

నార్కట్‌పల్లి: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న 7 ట్రాక్టర్లను నల్లగొండ జిల్లా టాస్క్‌ఫోర్స్, నార్కట్‌పల్లి పోలీస్ సిబ్బంది గురువారం మండల పరిధిలోని అమ్మనబోలు చౌరస్తాలో పట్టుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సైదాబాబు తెలిపారు.